## క్లుప్తంగా

### ముగిసిన రాజ శ్యామల హోమం



రాజ శ్యామల హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అక్షయపాత్ర ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** స్థానిక ఆదిశేష నిలయంలో శ్యామల (రాజ శ్యామల, మాతంగి) నవరాత్రుల సందర్భంగా పుష్యమాస అమావాస్యకు ప్రారంభమైన రాజ శ్యామల అఖండ హోమం 14 రోజులపాటు సాగి గురువారం మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగిసింది. నల్లా అజేంద్రనాథ్ బగళాకర్తగా 332 గంటల పాటు అహోరాత్రులు నిర్విరామంగా హోమాన్ని జ్వలింపజేశారు. ఈ పూజలలో మూల మంత్రాహుతులు, మండూకాది పీఠ, ఆవరణ, స్థాన దేవతాహుతులు సమర్పించారు. కార్యక్రమానికి చిక్కాల నాగ సుబ్రహ్మణ్యేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు రూ.10 వేలు, సలాది సాయిరామ్, జ్యోతి దంపతులు రూ.9 వేలు అందించారు. శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, నాగ కనకదుర్గ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రతువులో గోశాల సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

### తెలుగు పండితులకు సత్కారం




తెలుగు పండితులను సత్కరిస్తున్న మహిళా వాకర్స్ ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఇరువురు తెలుగు పండితులను ఘనంగా సత్కరించారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో విశ్రాంత ప్రథమ శ్రేణి తెలుగు పండితులు కుంచెపూడి జనార్దనస్వామి, మండలీక ఆదినారాయణలను పట్టువస్త్రాలతో సత్కరించారు. వీరు నాలుగు దశాబ్దాల పాటు తెలుగు వెలుగు కోసం అవిరళ కృషి చేశారని మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీపాద ఎస్. పద్మావతి అన్నారు. వాకర్స్ క్లబ్ జోన్ చైర్పర్సన్ యర్రమిల్లి సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్, క్లబ్ ప్రతినిధులు దువ్వూరి సుబ్బలక్ష్మి, పచ్చిగోళ్ల సత్యకుమారి, పోలిశెట్టి అనంతలక్ష్మి, శ్రీగిరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

### సమాజ సేవకు స్కౌట్స్ దోహదం



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల బృందం

**యానాం:** స్థానిక నవోదయ విద్యాలయలో ప్రపంచ స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు సర్ రాబర్ట్ బేడెన్ పాల్ జయంతిని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు అధ్యక్షతన స్కౌట్స్ పతాకాన్ని ఎగురవేశారు. బేడెన్ పాల్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల బాలికల్లో దేశభక్తిని నింపి సమాజ సేవకులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. స్కౌట్స్ మాస్టర్ డి.పాపారావు, వైస్ ప్రిన్సిపాల్ బేగం, వెంకటేశ్వర్లు, టీచర్ల బృందం పాల్గొన్నారు.

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలసిన ఎమ్మెల్యే



పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చౌహాన్‌ను సత్కరించిన ఎమ్మెల్యే అశోక్

**యానాం:** పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శరత్ చౌహాన్‌ను గురువారం ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. యానాం నియోజకవర్గంలో ఓఎన్జీసీ సంస్థ నుంచి మత్స్యకారులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం సొమ్ముకు సంబంధించి జీఓను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరగా, దానికి స్పందించిన ఆయన త్వరలోనే జీఓ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

### విద్యా రుణాలకు ఆమోదం

**యానాం:** పుదుచ్చేరి ఆదిద్రావిడ, ఎస్టీడీసీఓ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇచ్చే విద్యా రుణానికి సంబంధించి ఫైలును గురువారం ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. విద్యా రుణాలకు సంబంధించి నూతన నిబంధనలు తీసుకువచ్చారు.

# అందరికీ స్వచ్ఛమైన జలాలు

- 2024 చివరి నాటికి ప్రతి ఇంటికీ కుళాయి
- మంత్రి పినిపే విశ్వరూప్ వెల్లడి

**అమలాపురం రూరల్:** జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా 2024 చివరి నాటికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇందుపల్లి గ్రామంలో పంచాయతీరాజ్ విభాగం ద్వారా నరేగా నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయం-1 భవనాన్ని మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభించారు. అదే గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.31.30 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. నరేగా నిధులు రూ.23.94 లక్షలతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం-1ను వారు ప్రారంభించారు. సాకుర్రులో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ .25.50 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అదే గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజినీర్ విభాగం ఆధ్వర్యంలో నరేగా, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ .46.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి, ఎమ్మెల్సీ ప్రారంభించారు. అలాగే ఎంపీపీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన మినీ కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ నిర్మాణాలు, వెల్‌నెస్ సెంటర్లకు సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సర్పంచులు గుత్తుల చిరంజీవిరావు, చొల్లంగి శివాని, డాక్టర్ శ్రీకాంత్, ఎంపీడీఓ జోన్నాడ వెంకటేశ్వరరావు, పీఆర్‌డీఈఈ పీఎస్ రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కుడుపూడి నాగరాజు, బొక్కానరసింహమూర్తి, సొసైటీ చైర్మన్ అడపా బాబులు, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇందుపల్లిలో సచివాలయ భవన ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

# వలంటీర్లు సంక్షేమ సారథులు



జి.వేమవరంలో ఉత్తమ వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

**తాళ్లరేవు:** వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటున్నారని, అవినీతికి తావులేకుండా పథకాలను అర్హులకు అందిస్తున్నారని టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ అన్నారు. జి.వేమవరం పంచాయతీలోని గ్రీన్ వ్యాలీ లేఅవుట్‌లో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగింది. దీనికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాలను జన్మభూమి కమిటీలు సూచించిన వారికే ఇచ్చేవారని, అర్హత ఉన్నా పథకాలు రాక పేదలు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు పనిచేసి, అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం వలంటీర్ల పనితీరు ఆధారంగా సేవారత్న, సేవామిత్ర అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే అందించి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్షుడు కాద గోవిందకుమార్, సర్పంచ్ పి.సూరిబాబు, ఈఓపీఆర్డీ ఎం.భైరవమూర్తి, నాయకులు రేవు మల్లీశ్వరి, కొపనాతి నాగరాజు, బూరెల వెంకట్రాజు, యర్రంసీడి అప్పారావు, దెయ్యాల సత్తిబాబు, మట్టా లింగమూర్తి, నీలపాల శ్రీనివాస్, కొప్పిశెట్టి వెంకట్ పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా మహాశివరాత్రి ఉత్సవాలు



మురమళ్లలో మహాశివరాత్రి ఏర్పాట్లపై అర్చకులు, సిబ్బందితో సమావేశమైన అధికారులు, చైర్మన్ వాసురాజు



సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి అమ్మవారు

- మురమళ్లలో ఏర్పాట్లపై సమీక్ష
- సమన్వయంతో సాగాలని అధికారుల పిలుపు

**ఐ.పోలవరం:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12 వరకూ మహా శివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆలయంలో చైర్మన్ వాసురాజు అధ్యక్షతన అర్చకులు, పురోహితులు, సిబ్బందితో కలసి సమీక్ష నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు తరలి వస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, అభిషేక మండపాలు, తదితర ఏర్పాట్లు చేయాలని చర్చించారు. 8వ తేదీ మహాశివరాత్రిన జరిగే ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం, చివరి రోజు తెప్పోత్సవం ఏర్పాట్లలో తగు జాగ్రత్తలు తీసుకుని, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడడానికి పోలీసు, గ్రామస్తులు, అగ్నిమాపక అధికారుల సహకారాలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యనమండ్ర సత్యసీతారామశర్మ, నాగాభట్ల రామకృష్ణమూర్తి, యనమండ్ర సుబ్బారావు, దండు వీరభద్రరాజు తదితరులు ఉన్నారు.

**రేపటి నుంచి సత్తెమ్మ తల్లి జాతర**

**ముమ్మిడివరం:** భక్తుల కొంగు బంగారం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3 వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 50వ వసంతం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈసారి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 24 నుంచి తొమ్మిది రోజులపాటు ఏర్పాటు చేసిన నాటకాలు, బుర్రకథలు, కూచిపూడి నాట్యం, జానపద గేయాలు, సంగీత విభావరిలు ఆద్యంతం ఆకట్టుకోనున్నాయి. వచ్చే నెల 3న అమ్మవారి తీర్థ మహోత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాల్లో సుమారు 2 వేల మంది కళాకారులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

## రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

**తాళ్లరేవు:** రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. గురువారం ఇంజరం పంచాయతీ పరిధి పెదగోవలంక వెళ్లే రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.ఆరు లక్షలతో ఈ పనులు చేస్తున్నామని, వీటితో పాటు గ్రామంలో మరికొన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు ఎంపీపీ వివరించారు. సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, ఉప సర్పంచ్ కోరుకొండ అప్పారావు, గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి, నాయకులు రాయుడు గంగాధర్, కూరాటి వాసు తదితరులు పాల్గొన్నారు.



పెదగోవలంకలో సీసీ రహదారికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ సునీత తదితరులు

### సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**ఉప్పలగుప్తం:** విలసవిల్లి భీమ్‌నగర్‌లో రూ.13 లక్షల జీజీఎంపీ, పంచాయతీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామంలోని అన్ని రోడ్లను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుత్సల ఏసు, అడబాల సురేష్, బళ్ల భాస్కరరావు పాల్గొన్నారు.

### సేవలు అభినందనీయం: మంత్రి వేణు



సత్యనారాయణమూర్తికి అవార్డు అందజేస్తున్న మంత్రి వేణు తదితరులు

**అమలాపురం రూరల్:** అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిలాంత్రోపిక్ సొసైటీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విభిన్న రంగాల్లో ప్రతిభావంతులకు గోదావరి కీర్తి పురస్కారాలను రాజమహేంద్రవరంలో అందించింది. అమలాపురం సాకుర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న ఉప్పే సత్యనారాయణ మూర్తి నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న సేవలను గురించి అవార్డు అందించారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తదితరులు సత్యనారాయణను సత్కరించారు.

### నేడు 'వలంటీర్లకు వందనం'

**అమలాపురం టౌన్:** స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా పట్టణంలోని వలంటీర్లకు పురస్కారాలు, సత్కారాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని వలంటీర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

**నేడు ఎమ్మార్పీఎస్ సమావేశం**

**ఉప్పలగుప్తం:** రావులపాలెం శ్రీకృష్ణదేవరాయులు కల్యాణ మండపంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశం జరుగుతుందని మండల కార్యవర్గం తెలిపింది. ఈ మేరకు నంగవరంలో గురువారం సత్తాల దుర్గారావు మాట్లాడుతూ ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు.

**విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం**

**ఐ.పోలవరం:** మండలంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేస్తామని ఆ శాఖ అధికారి మోకా రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు.

**యానాం:** నియోజకవర్గ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ లంక కృష్ణారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదనపు హైటెన్షన్ విద్యుత్ లైన్ల మరమ్మతులు నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా ఉండదని అన్నారు.

### 28న మార్కెట్ ఆశీలు వేలం

**అమలాపురం టౌన్:** స్థానిక మున్సిపాలిటీలో 2024–25 సంవత్సరానికి రోజు వారీ మార్కెట్ ఆశీలు వసూలుకు హక్కు నిమిత్తం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయంలో జరుగుతుందని కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా ధరావత్తు సొమ్ము రూ.7 లక్షలు, రూ.20 లక్షల విలువ గల సాల్వెన్సీ సర్టిఫికెట్లు దాఖలు చేయాలన్నారు. అలాగే అమలాపురం మున్సిపల్ కార్యాలయం మెయిన్ గేటు పక్కన గల మీ సేవా భవనం మూడేళ్ల కాల పరిమితితో బ్యాంక్‌లు, ఆసుపత్రులు, ఇతర వ్యాపారాలకు సంబంధించి తాత్కాలిక పద్ధతిన నెలవారీ అద్దె చెల్లించే నిమిత్తం ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయ పనివేళల్లో రెవెన్యూ విభాగాన్ని సంప్రదించాలన్నారు.

## ప్రజలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం



శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

**ఐ.పోలవరం:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా తమ ట్రస్టు పనిచేస్తుందని నవ భారత్ గ్రామీణ అభివృద్ధి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అంగాడి రేవతి అన్నారు. గురువారం కొమరగిరి రామారావుపేటలో ఇమ్మానుయేలు ప్రేయర్ ఫెలోషిప్ చర్చి వద్ద ట్రస్టు మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం పేదలకు చేరువ చేస్తున్నామన్నారు. అనంతరం 800 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో జనరల్ విభాగానికి చెందిన డాక్టర్ ఎం.ఫణిరమణ భూషణ్, ఎముకల వైద్య నిపుణులు పి.సూర్యప్రకాష్ నాయుడు, డాక్టర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భారత్ రైస్‌కు మంచి స్పందన



భారత్ బ్రాండ్ రైస్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేమా తదితరులు

**అమలాపురం రూరల్:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన భారత్ బ్రాండ్ రైస్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తుందని జిల్లా శాఖ బీజేపీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. అమలాపురం యర్రమిల్లివారి వీధిలోని పార్టీ కార్యాలయం వద్ద భారత్ రైస్‌ను విక్రయించారు. దీనిని ది చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, సినీనటుడు కంచిపల్లి అబ్బులు, చాంబర్ కార్యదర్శి కొమ్మూరి నాగ వెంకటచలప్రసాద్, ట్రెజరర్ దొమ్మేటి సాయిబాబు ప్రారంభించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, యువ మోర్చా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ, ఆర్‌టీఐ సెల్ కన్వీనర్ అరిగెల తేజ వెంకటేష్, ఉపాధ్యక్షుడు జగతా శాంతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షుడికి అభినందన



చినబాబును అభినందిస్తున్న వ్యాపార సంఘాల ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ సలహాదారు తాళాబత్తుల చినబాబు జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా వ్యాపార సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం జరిగింది. స్థానిక బులియన్ మార్కెట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చినబాబును వ్యాపార ప్రతినిధులు అభినందించారు. చినబాబు అటు చాంబర్ ఆఫ్ కామర్స్, ఇటు స్వర్ణకార సంఘం అభివృద్ధికి సంయుక్తంగా కృషి చేస్తారని చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆకాంక్షించారు. చాంబర్ గౌరవాధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, వ్యాపార సంఘాల ప్రతినిధులు గోకరకొండ హరిబాబు, నంబూరి నరేష్, వలవల శివరావు, కొవ్వూరి వెంకటరెడ్డి దున్నాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## హోమ్‌గార్డు పోస్టులకు జూన్ 16న పరీక్ష

**యానాం:** యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్లలో 500 హోమ్‌గార్డు పోస్టుల భర్తీకి ఈ ఏడాది జూన్ 16న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ వింగ్ సెక్రటరీ పంకజ్‌కుమార్‌ఝా ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మహిళా, పురుష అభ్యర్థులకు పరీక్ష ఉంటుందన్నారు. అదేవిధంగా కో ఆపరేటివ్ జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు జూన్ 30న, ఇన్వెస్టిగేటర్ ప్లానింగ్ అండ్ రీసెర్చ్ శాఖ పోస్టుకు జూలై 14న, ఫైర్ సర్వీసులో స్టేషన్ ఆఫీసర్, ఫైర్‌మెన్ డ్రైవర్ గ్రేడ్-3 పోస్టులకు జూలై 28న, ఫైర్‌మెన్ పోస్టులకు ఆగస్టు 11న పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

## రూ.4,634.29 కోట్లతో మధ్యంతర బడ్జెట్

**యానాం:** 2023–24 ఆర్థిక సంవత్సరంలో వచ్చే ఐదు నెలల కాలానికి రూ.4,634.29 కోట్లతో కూడిన మధ్యంతర బడ్జెట్‌ను గురువారం ఆర్థిక మంత్రి హోదాలో పుదుచ్చేరి సీఎం రంగసామి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్ కాకుండా మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పూర్తి స్థాయి బడ్జెట్‌ను 2024–25 కాలానికి ప్రవేశపెడతారని భావిస్తున్నారు. ఈ మొత్తం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ ఖర్చు చేయనున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అశోక్ పాల్గొన్నారు.

## సపక్ తక్రా పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి సపక్ తక్రా పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు

**అమలాపురం రూరల్:** అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సపక్ తక్రా జట్టు ఎంపికలు జిల్లా అసోసియేషన్ సభ్యుడు మునగాల మన్యం, సంయుక్త కార్యదర్శి లంక జార్జి, ఎస్‌వీవీ ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరు కాగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఏఆర్ డీఎస్పీ విజయ సారథి, పీడీ కేపీఎస్ ప్రసాద్‌లు ఎంపికైన క్రీడాకారులను పరిచయం చేసుకుని రాష్ట్రస్థాయిలో బంగారు పతకం తీసుకురావాలని సూచించారు. టీమ్ కోచ్‌లుగా సీహెచ్ మోహన్‌కృష్ణ, మట్టపర్తి మురళీకృష్ణ, టీమ్ మేనేజర్‌గా జీవీ బాబు వ్యవహరిస్తున్నారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో సీహెచ్ శశిధర్ నాగ్, జి.సందీప్ ఎ.యశ్వంత్, జి.అదివిత్, పి.రోహిత్ సాయి ఫణీంద్ర, బాలుర జూనియర్స్ విభాగంలో దుర్గా చందు, కె.జగదీష్, ఎ.పవన్, అఖిలేష్, షణ్ముఖ శ్రీహరి ఎంపికయ్యారు. వీరు నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని కోచ్ యాండ్ర గౌతమ్, కేతా సతీష్ తెలిపారు.

### నూతన వసంత మంటపం ప్రారంభం

**సఖినేటిపల్లి:** అంతర్వేది క్షేత్రంలో గురువారం నూతనంగా రూ.18 లక్షలతో నిర్మించిన వసంత మంటపాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజబహద్దూర్ కలిసి ప్రారంభించారు. ఏటా ఉత్సవాల్లో పౌర్ణమి రోజున స్వామి సముద్రంలో స్నానమాచరించిన అనంతరం వసంత మంటపంలో సేద తీరడం ఆనవాయితీగా వస్తోంది. వసంత మంటపం పూర్తి శిథిల స్థితికి చేరడంతో, నూతన వసంత మంటపం నిర్మాణానికి దేవస్థానం శ్రీకారం చుట్టి ప్రారంభించింది.

## ఎంపీపీ భాగ్యలక్ష్మికి మంత్రి పరామర్శ



ఎంపీపీ భాగ్యలక్ష్మిని పరామర్శిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

**అమలాపురం టౌన్:** ఇటీవల అస్వస్థతకు గురై స్థానిక సూర్యనగర్‌లోని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న అమలాపురం మండల పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం పరామర్శించారు. ఆమె త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. అనారోగ్యంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న భాగ్యలక్ష్మి భర్త, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబును కూడా మంత్రి పరామర్శించారు. అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఉన్నారు.

**సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్‌కు..**

పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబును కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం గురువారం పరామర్శించారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని స్థానిక సూర్యనగర్‌లోని ఇంట్లో విశాంత్రి తీసుకుంటున్న బాబును ముద్రగడ పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముద్రగడతోపాటు రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, చిక్కం కిట్టు, వర్రే శేషు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



వైఎస్సార్ సీపీ నేత బాబును పరామర్శిస్తున్న ముద్రగడ తదితరులు